

మోదకొండమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి -పాడేరు: మోదకొండమ్మ అమ్మవారిని హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సుబ్బారెడ్డి దంపతులకు ఆలయ కమిటీ తరపున ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్యాత్మిక సభ్యులు ఉప్పల వెంకటరత్నం, స్థానిక అడ్వకేట్ తమర్బ ప్రసాద్ నాయుడు జడ్జి సుబ్బారెడ్డిని శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.



న్యాయమూర్తికి జ్ఞాపికను ఇస్తున్న సభ్యులు

పన్ను వసూళ్లకు నోటీసులు జారీ చేయండి

-సచివాలయ సిబ్బంది ముఖ హాజరు తప్పనిసరి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఇటీవల కాలంలో అనేక నిర్మాణాలు జరిగాయని, వాటిని పన్ను పరిధిలోకి తీసుకొని పన్ను మదింపు చేసి నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓ లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పంచాయతి పరిధిలో సర్వే నిర్వహించి పన్ను మదింపు చేయని ఆస్తులు, తక్కువగా మదింపు చేసిన ఆస్తుల వివరాలు సేకరించి సరైన రీతిలో పన్ను మదింపు చేసి నోటీసులు జారీ చేయాలని, వాటిపై వచ్చిన ఫిర్యాదులను తగు రీతిలో పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా పూరి గుడిసెలలో ఉన్న వారికి పన్ను మినహాయింపు ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేసారు. అదేవిధంగా నిర్మాణాలు కట్టబడిన సంవత్సరం ఆధారంగా పన్ను మదింపు చేయాలన్నారు. పంచాయతి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది రెండు పూటలా ముఖ హాజరు తప్పనిసరిగా వేసి నివేదించాలని ఆదేశించారు. పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్రతి పక్షానికి ఒక సారి ట్యాంకులు శుభ్రపరచాలని ఆదేశించారు. అదేవిధంగా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జనన మరణ ఆలస్య నమోదు లను గుర్తించి త్వరితగతిన ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద అవసరమైన వారికి పని కల్పించాలని ఆదేశించారు. 150 పని దినాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వారికి బ్యాంకు ఖాతాలు తెరవడంలో అడ్డంకులను పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు బ్యాంకర్లతో చర్చించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. జాబ్ కార్డుల జారీ సక్రమంగా చేపట్టాలని, తొలగించిన జాబ్ కార్డులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఆరోగ్య శ్రీ యాప్ డౌన్లోడ్ చేయించాలని, అందుకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ జమాల్ బాషా, జిల్లా పంచాయతి అధికారి కొండలరావు, డివిజినల్ పంచాయతి అధికారి పిఎస్ కుమార్, డిబిటి మేనేజర్ నరేశ్, ప్రాజెక్ట్ అధికారులు, వి.అభిషేక్, చైతన్య, ఎంపిడిఓలు, ఎపిడిలు, ఎపిఒలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉచిత సివిల్స్ శిక్షణ


రెండో దశ ఫలితాలు విడుదల

29, 30 తేదీలలో ఇంటర్వ్యూలు

ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఏ ఆధ్వర్యంలో విద్యావంతులైన నిరుద్యోగ గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ శిక్షణకు నిర్వహించిన రెండవ దశ రాత పరీక్షల ఫలితాలను ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ బుధవారం ఐటిడిఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో విడుదల చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 23న నిర్వహించిన రెండవ దశ రాత పరీక్షకు 502 మంది అభ్యర్థులు హాజరయ్యారని 1 : 3 రేషియోలో 158 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మాక్ ఇంటర్వ్యూ లలో అనుభవం కలిగిన అభ్యర్థులతో ఈనెల 29, 30 తేదీలలో ఐటిడిఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఐటిడిఏలో హాలు టికెట్లు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో ఉత్తమ మార్కులు సాధించిన 50 మంది అభ్యర్థులను ఎంపిక చేసి నవంబరు 1వ తేదీ నుండి "మీ కల మా కర్తవ్యం" "ప్రాజెక్టు లక్ష్య" పేరిట వేపగుంట వైటిసిలో శిక్షణ అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1, గ్రూప్ 2 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తుందన్నారు. సివిల్స్ పరీక్షలు ఇంగ్లీషు, హిందీ బాషలలో నిర్వహిస్తారని అందుకే ఉచిత శిక్షణకు ఇంగ్లీషులో రాత పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చదువే వెలుగు పేరిట 10వ తరగతి చదువుతున్న 52 మంది బాల, బాలికలను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసి ఈనెల 26 వతేదీ నుండి ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణ అందిస్తున్నామన్నారు. మండలంలోని దిగుమోదా పుట్టు, గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని తదితరులు పాల్గొన్నారు.





వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిరణ్, సిపిఎం మండల నాయకులు

అసమానతలు లేని అభివృద్ధికి బస్సు యాత్ర

- పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి - ఎటపాక

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం బస్సు యాత్ర చేపట్టిందని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో జరిగే బస్సు యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. బస్సుయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే ముఖ్యమైన ఎజెండాగా ప్రభుత్వ పాలన ఉండాలని సిపిఎం కోరుకుంటుందని చెప్పారు. ప్రజల పక్షాన ప్రతిపక్షాలు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, ఎటపాక మండలం కార్యదర్శి ఐ వెంకటేశ్వర్లు, నాయకులు ఇరపా అజయ్ కుమార్, తాటి అశోక్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల శుద్ధి యంత్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తడిగిరి గ్రామ పంచాయతీలో లయ సంస్థ సహకారంతో మిరియాలు, సామలు, కొర్రలు, రాగులు, పసుపు శుద్ధి యంత్రాలను ఎస్వీడీఎస్ చీఫ్ సెక్రటరీ జోగి నాయుడు, సర్పంచులు పెనుమాల రంజిత్ కుమార్, సోమెలి సత్యవతి కలిసి బుధవారం ప్రారంభించారు. మండలంలోని తడిగిరి గ్రామ పంచాయతీలో చిరుధాన్యాలు శుద్ధి యంత్రాలను ఉచితంగా అందించారు. అనంతరం ఆ సంస్థ చీఫ్ సెక్రటరీ జోగినాయుడు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు పండించిన పంటలకు శుద్ధి యంత్రాలను అందజేయడం జరిగిందన్నారు. శుద్ధి చేయక పోవడంతో పంటలకు సరైన ధర లేదని ఆయన పేర్కొన్నారు. శుద్ధి చేసిన పంటలకు మంచి ధర ఉంటుందని తెలిపారు.అల్లూరి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం, అంబేద్కర్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాలు, లయ సంస్థ ఆర్థిక సహాయంతో యంత్రాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు సోమేలి లక్ష్మయ్య, ఎస్వీడిఎస్ సూపర్వైజర్ నాగమణి, మధులత పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న జోగినాయుడు, సర్పంచులు

తుది ఫలితాల వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు: నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో ఉద్యోగాల తుది ఫలితాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పారదర్శకంగా నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ ఫెలో ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోపు ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి హాజరు కావాలని చెప్పారు. ఫలితాలను జిల్లా వెబ్సైట్లోనూ కలెక్టర్ కార్యాలయ నోటీసు బోర్డులో ప్రకటించామని తెలిపారు.

గ్యాస్ లీకేజీతో మంటలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి గ్రామంలో బుధవారం ఉదయం ఓ గిరిజనుడి నివాస గృహంలో వంట గ్యాస్ లీకైంది. గ్యాస్ లీకేజీతో వంట గదిలో మంటలు. ఎగిసి పడ్డాయి. దీంతో, భయభ్రాంతులకు గురైన ఆ కుటుంబీకులు నివాస గృహం లోపల నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. జిల్లా కేంద్రం పాడేరులో అగ్నిమాపక కేంద్రానికి గిరిజన కుటుంబం సమాచారం అందించింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకునే లోపు గ్యాస్ లో మంటలు తగ్గుముఖం పట్టడంతో ప్రమాదం తప్పింది.



వ్యాపిస్తున్న మంటలు



కూటూరులో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు, ప్రజాప్రతినిధులు

కూనవరాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- సిపిఎం నాయకులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని కూటూరు గ్రామంలో వర్షాలు లేక, సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో జూన్, జులై, ఆగస్టు నెలలో భారీ వర్షాలు కురిసి గోదావరి వరదలు వల్ల ముంపునకు గురికాగా, తరువాత పంటలు వేసే సమయంలో వర్షాలు లేక పూర్తి స్థాయిలో పంటలు వేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. వేసిన వరి, మినుము, పెసర జొన్న, మిర్చి తదితర పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయన్నారు. కొందరి భూములు బీడు భూములు మారాయని తెలిపారు. పంటలను రక్షించుకోవడానికి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం నుండి వ్యవసాయానికి సహకారం లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే గోదావరి, శబరి నదులున్నా సాగునీరు అందని పరిస్థితి ఉందని, శబరి నది ఒడ్డున వున్న విద్యుత్ లైన్లను సరిచేసి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, ఐటిడిఎ ద్వారా మోటార్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలన్నీ ఎండిపోయిన నేపథ్యంలో కూనవరం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు పూర్తి సబ్సిడీతో కూడిన వ్యవసాయ పరికరాలు, బోర్లు, విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపిటిసి ధర్ముల అమ్మాజీ, సర్పంచులు నాగమణి, బి.వెంకమ్మ, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఆర్‌టిసి భూమి అన్యాక్రాంతం చట్టవిరుద్ధం

కలెక్టర్‌కు గిరిజన సంక్షేమ మాజీ కమిషనర్ ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కి చెందిన భూమిలో కొంత భాగం వాణిజ్య కార్యకలాపాల కోసం అన్యాక్రాంతమవుతున్నట్లు తనకు తెలిసిందని, ఈ పరాయికరణ చట్ట విరుద్ధమని గిరిజన సంక్షేమ శాఖ మాజీ కమిషనర్ఇఎఎస్ శర్మ తెలిపారు. ఈ మేరకు అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ఆ లేఖలో పేర్కొన్న వివరాలు.. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియా ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ (ఎల్‌టిఆర్) పాడేరు ఉన్న షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనేతరులకు భూమిని అన్యాక్రాంతం చేయడాన్ని నిషేధించింది. సుప్రసిద్ధ సమతా తీర్పులో సుప్రీంకోర్టు దీన్ని పునరుద్ఘాటించింది. పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం (పేసా)స్థానిక గిరిజనులను ప్రభావితం చేసే ఏ నిర్ణయాన్ని సంబంధిత గ్రామ సభ ముందస్తు అనుమతి లేకుండా తీసుకోరాదని ఆదేశించింది. సంబంధిత అధికారులు పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై స్థానిక గిరిజనులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆక్షేపించబడిన ప్రభుత్వ ఉత్తర్వు అమలుకు వ్యతిరేకంగా స్టే మంజూరు చేసింది. ఈ భూమిని వాణిజ్యీకరించడం కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినట్లే. షెడ్యూల్డ్ ప్రాంతాలలో వర్తించే రక్షణ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించినందున కలెక్టర్, పాడేరు సబ్-కలెక్టర్ జోక్యం చేసుకుని నిర్మాణ కార్యకలాపాలను ఆపి, షో-కాజ్ నోటీసు జారీ చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు ఎల్‌టిఆర్, పెసా, ఎఫ్ఆర్ఎ వంటి చట్టాలకు సంరక్షకులుగా వ్యవహరించాలనే వాస్తవాన్ని గ్రహించి, ఆ చట్టాలను ఎవరూ ఉల్లంఘించకుండా చూసుకోవాలన్నారు. ఈ లేఖపై అత్యవసరంగా జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.

సిపిఎం నేతకు పరామర్శ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామంలో సిపిఎం నాయకుడు పి.మోహన్‌దాస్ తండ్రి సెరెంగ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు కే.సురేంద్ర, గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ పి.సత్యనారాయణ, పి.దొంబు బుధవారం ఆ గ్రామంలో సందర్శించి కుటుంబీ కులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు.



ప్రతిభ చాటిన సూర్యారావు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సూర్యారావు ప్రతిభ

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక హుకుంపేట గ్రామ పంచాయతీకి చెందిన కొండపల్లి సూర్యారావు తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈనెల 5వ తేది నుండి 8వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్, నోయిడా ఇండోర్ స్టేడియంలో జరిగిన ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న కొండపల్లి సూర్యారావు రజితం పతకం సాధించారు. పలు రకాల ప్రశంస పత్రాలు పొందారు. సూర్యారావును ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, బాకురు ఎంపీటీసీ రజిని, వార్డు సభ్యులు కొర్రా నాగరాజు అభినందించారు.

ఆశ్రమ పాఠశాలల అవుట్ సోర్సింగ్ కార్మికుల

సమస్యలపై ఐటిడిఎ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి- చింతూరు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నడపబడుతున్న ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల ఔట్ సోర్సింగ్ వర్కర్లకు సమాన సమాన వేతనం ఇస్తామని వైఎస్.జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చాలా దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగి చనిపోతే కనీసం ఎక్స్‌గ్రేసియా కూడా చెల్లించడం లేదన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులకు ఎక్స్‌గ్రేసియా సంబంధించి 119, 25 జిఒలు ఉన్నా వాటి ఐటిడిఎ అధికారులు అమలు చేయకపోవడం దారుణమన్నారు. చింతూరు డివిజన్లో 11 మంది వర్కర్లు చనిపోతే వారి కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా జీవోలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, రక్షణ పరికరాలు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య అనుగుణంగా వర్కర్ పోస్టులు భర్తీ చేయాలని, హెచ్ఆర్ఎ, ఇఎస్ఐ అమలు చేయాలని, యూనిఫామ్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఐటిడిఎ పిఒ చైతన్యకు అందజేశారు. దీనికి స్పందించిన పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, మిగతా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియు జిల్లా నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, బీరబోయిన దిలీప్, హాస్టల్ వర్కర్లు కారం చంద్రమ్మ, రాజమణి, వీరయ్య, తిరుపతమ్మ, రమణమ్మ, సీతమ్మ, వీరస్వామి, రాంబాబు, బాబురావు, చంద్రయ్య, నాంచారమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాల అవుట్ సోర్సింగ్ కార్మికులు



ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న పిడతమామిడి గ్రామస్తులు

సామాజిక భవనం మంజూరుకు వినతి

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని పిడతమామిడి గ్రామానికి సామాజిక భవనం మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన సుర్ల సింహాద్రి, గణపతి, వెంకన్నదొర, పెద సోమరాజు, మల్లేష్ తదితరులు బుధవారం అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి శరభన్నపాలెంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కమ్యూనిటీ భవనం లేక సామాజిక హితమైన కార్యక్రమాలు, గ్రామ సభలు, ఇతర సమావేశాలు, శుభ కార్యక్రమాలు జరిపేందుకు వేదిక లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు.

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల పరిరక్షణ

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లె రెడ్డి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆదివాసీలంతా ఐక్య ఉద్యమాలు చేయడం ద్వారానే హక్కులను, చట్టాలని పరిరక్షించుకోవచ్చని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి అన్నారు. ఏజెన్సీ 7 మండలాల్లోని అన్ని తెగలలో ఉన్న బోగస్ ఎస్‌టి సర్టిఫికెట్లను రద్దు చేయాలని, లక్షల రూపాయలు తీసుకొని డిఎల్ఎస్‌సిలో తప్పుడు రిపోర్టు తయారు చేస్తున్న ఐటిడిఎ లీగల్ సెల్ డిటి చైతన్యను విధుల నుండి తొలగించాలని కోరుతూ ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన రంపచోడవరం ఐటీడీయే ఎదురుగా చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష బుధవారం నాటికి 5వ రోజుకు చేరింది. ఈ దీక్షా శిబిరాన్ని సిరిమల్లె రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడు తెగలలో నకిలీ సర్టిఫికెట్లు ఉన్నాయని, ఇది చాలా క్లిష్టమైన సమస్య అని పేర్కొన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలు పెరిగిపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. అధికారులు లంచాలు తీసుకొని పెద్ద ఎత్తున సర్టిఫికెట్లు జారీ చేయడం దారుణమన్నారు. తప్పుడు సర్టిఫికెట్ జారీ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసా చట్టం గ్రామసభలు సరిగా అమలు చేయకపోవడం వల్లే ఈ నకిలీల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, ఇప్పటికైనా అధికారులు పీసా చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీసా చట్టం గ్రామసభల ద్వారానే నకిలీ సర్టిఫికెట్ల రద్దు, వాటి నియంత్రణ సాధ్యమవుతుందని చెప్పారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది విద్య, ఉపాధి, ఉద్యోగ రాజకీయ, వ్యాపార రంగాలలో నిజమైన ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం వచ్చే నెల 14, 15 తేదీలలో జాతీయ స్థాయిలో పాడేరులో జరిగే బిర్సా ముండా జయంతి వేడుకల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వనలం శుభ కృష్ణ దొర, మడకం వరప్రసాద్ దొర, కారం రామన్న దొర, పండా పవన్ కుమార్ దొర, ఎంపీటీసీ ఉర్రం జగదీష్ దొర, మాజీ ఎంపీటీసీ కర్రి అబ్బాయి రెడ్డి, సర్పంచ్ కర్రి చిన్న బుల్లబ్బాయి రెడ్డి, చీకల సత్యనారాయణ, పల్లాల వెల్లాయమ్మ, పోడియం శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిరిమల్లె రెడ్డి

నేడు మాజీ ఎమ్మెల్యే దేముడు వర్ధంతి

ప్రజాశక్తి-కొయ్యూరు

చింతపల్లి మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు 8వ వర్ధంతిని ఆయన స్వగ్రామం వెలగలపాలెం వద్ద గురువారం నిర్వహిస్తున్నట్లు ఆయన కుమార్తె, అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేముడు మెమోరియల్ పార్క్ వద్ద స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి అనుచరులైన గాం గంటందొర, మల్లుదొర, మర్రి కామయ్య తదితరుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్టు మాధవి వెల్లడించారు. దేముడు వర్ధంతి సందర్భంగా పార్క్ వద్ద రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వర్ధంతి వేడుకలకు దేముడు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.


స్టాల్‌ను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జడ్పిటిసి రేగం మత్స్యలింగం, స్థానిక సర్పంచ్ కించాయి కృష్ణ బుధవారం ప్రారంభించారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. అనంతరం జడ్పిటిసి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగం పై దృష్టి పెట్టిందన్నారు. అనంతరం స్థానిక శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ లను ఏర్పాటు చేశారు. గిరిజన ప్రాంతంలో ఉన్న పలు రకాల చిరుధాన్యాలు, వంటకాల స్టాల్స్‌తో ప్రజలకు ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్ బాలామణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కించాయి కృష్ణ, సచివాలయం డిడిఓ జి.అశోక్‌కుమార్, బూర్జ సర్పంచ్ పాంగి బొంజుబాబు, దుర్గం ఎంపీటీసీ కిల్లో సాంబ, గత్తుమ సర్పంచ్ పాడి పోతురాజు, దుర్గం సర్పంచ్ పాతాని చందన ప్రత్యూష, వైస్ సర్పంచ్ కొర్ర మల్లమ్మ, వైద్యులు అనూష, విజయకుమార్, ప్రశాంత్, వార్డ్ సభ్యులు ధర్మారావు, మాజీ వార్డ్ మెంబర్ శోభ గాసిదొర పాల్గొన్నారు.

అనంతగిరి: పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని రాష్ట్ర జీసీసీ చైర్మన్ శోభ స్వాతిరాణి అన్నారు. మండలంలో గుమ్మకోట, గరుగుబిల్లి రెండు పంచాయతీలకు కలిపి గురుకుల బాలుర పాఠశాల వద్ద స్థానిక సర్పంచ్ పాంగి. అప్పారావు ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. పరీక్షల అనంతరం గుర్తించిన వ్యాధులకు మెరుగైన వైద్యం కోసం రోగులు కోరుకున్న ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ శెట్టి. నీలవేణి, వైస్ ఎంపిపి దూరు జయపర్తిని, ఎంపీటీసీ తవిటి నాయుడు, గరుగుబిల్లి సర్పంచ్ పద్మ, వైసిపి సీనియర్ నాయకులు డి గణేష్, స్థానిక వైద్యాధికారి సంతోష్, హెల్త్ సూపర్వైజర్ దాలప్పదొర, సిడిపిఓ సంతోషం కుమారి, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, వీఆర్వో కోటిబాబు పాల్గొన్నారు.


మందుల గురించి ఆరా తీస్తున్న జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

జెడ్‌పి సిఇఒగా పోలినాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : విశాఖ జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా ఎం.పోలినాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వి.మాడుగుల ఎంపిడిఒగా కొంతకాలం పనిచేసిన ఆయన ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఒఎస్‌డిగా పనిచేస్తున్నారు. సిఇఒగా పనిచేస్తున్న పి.శ్రీరామమూర్తిని మాతృసంస్థ సహకార శాఖకు పంపించి ఆయన స్థానంలో పోలినాయుడును నియమించింది. 2007 బ్యాచ్ గ్రూప్-1కు చెందిన పోలినాయుడు గతంలో శ్రీకాకుళం జిల్లాలో పనిచేశారు.



జలాశయాల్లో తగ్గుతున్న నీరు


పెద్దేరు జలాశయం నీరు అందక కవుగుంటలో ఎండిపోతున్న వరి

- వరికి సాగునీటి సరఫరాపై ఆందోళన
- ఇదే పరిస్థితి కొనసాగితే పంటపై ప్రభావం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వర్షాభావంతో జలాశయాల కింద ఆయకట్టు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పొట్ట దశలో వరికి అవసరమైన నీరు అందించగలిగినంత సామర్ధ్యం జలాశయాలకు లేదు. పెద్దేరు మినహా మిగిలిన మూడు జలాశయాలు పూర్తిస్థాయి నీటి సామర్ధ్యానికి దరిదాపుల్లో లేవు. దీంతో వరి పంటకు చివరి వరకు సరిపడా నీరు అందుతుందా? లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరీవాహక ప్రాంతాల్లో తగినంత వర్షాలేకపోవడంతో జలాశయాల్లోకి వచ్చే నీటి ప్రవాహం తక్కువగా ఉంది. ఈ నెలలో వర్షాలు సరిగా కురవకపోవడంతో జలాశయాల నీటిపై రైతులు పూర్తిగా ఆధారపడి సాగుచేస్తున్నారు. జిల్లాలోని నాలుగు జలాశయాల కింద నీటిపారుదలశాఖ లెక్కల ప్రకారం 75,414 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంట్లో ఖరీఫ్‌లో 60,269 ఎకరాల్లో వరి సాగైంది. వాస్తవ సాగులో 85 శాతం నమోదైంది. నీరు సరిగా సరఫరా చేయలేకపోవడంతో ఈ ఆయకట్టుకు కూడా సాగునీరు అందించలేని దుస్థితిలో అవి ఉన్నాయి. దీంతో వరి పంట 20వేల ఎకరాల వరకు దెబ్బతినే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. తాండవ జలాశయ ఆయకట్టు 32,689 ఎకరాల్లో 22,140 ఎకరాలు, రైవాడ ఆయకట్టు 15,344 ఎకరాల్లో 14,352 ఎకరాలు, కోనాం ఆయకట్టు 12,276 ఎకరాల్లో 11,620 ఎకరాలు, పెద్దేరు ఆయకట్టు 15,105 ఎకరాల్లో 12,157 ఎకరాల్లో వరి సాగు జరిగింది.

గతేడాది కంటే జలాశయాల్లో నీరు తక్కువగా ఉంది. వర్షాలు కురవడంతో ఆయకట్టుకు పెద్ద సమస్య ఏర్పడలేదు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడం, ఉన్న నీటిని సరఫరా చేయడానికి తగినట్లు జలాశయాలు, వాటి కాలువలను నిర్వహించకపోవడంతో ఆయకట్టుపై తీవ్రమైన ప్రభావం పడింది. బుధవారం నాటికి తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం సామర్థ్యం 380 అడుగులకు గతేడాది 378 అడుగుల నీరుండగా, ఈ ఏడాది 357 అడుగులు ఉంది. రైవాడ సామర్థ్యం 114 మీటర్లకు గతేడాది 113 మీటర్లుండగా ఈ ఏడాది 109 మీటర్లు ఉంది. కోనాం సామర్థ్యం 101 మీటర్లకు గతేడాది 100 మీటర్ల వరకు ఉంది. ఈ ఏడాది 93 మీటర్లకు పడిపోయింది. పెద్దేరు సామర్థ్యం 137 మీటర్లకు గతేడాది 135 మీటర్లు ఉండగా, ఈ ఏడాది కాస్త దగ్గరగా 134 మీటర్ల నీరు ఉంది.

నూతన భవనంలోకి కోర్టులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా కోర్టు సముదాయంలో నూతనంగా నిర్మాణమైన 'కోర్టుల కాంప్లెక్స్' (10కోర్టు బిల్డింగ్) పూర్తిగా సిద్ధమై విధుల నిర్వహణ కూడా ప్రారంభమైంది. మొత్తం 4 ఫ్లోర్ల భవన సముదాయంలో రెండు ఫ్లోర్లు కార్లు, టూ వీలర్ పార్కింగ్ కోసం, మిగతా రెండు ఫ్లోర్లు కోర్టుల కోసం కేటాయించారు. ఈ మేరకు పాత జిల్లా కోర్టు ఆవరణలోగల 10 కోర్టులు బుధవారం న్యూ కోర్ట్సు బిల్డింగ్ (ఎన్‌సిబి)లోకి షిఫ్టు అయ్యాయి. లాయర్లు, జడ్జిలు, సిబ్బంది వందల సంఖ్యలో అక్కడకు బుధవారం తరలివెళ్లారు. ఇక్కడ కోర్టు బిల్డింగ్ కాంప్లెక్స్ (సిబిసి)లో 2 ఫ్యామిలీ కోర్టులు, 5 అడిషనల్ జిల్లా కోర్టులు, 2 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు మొత్తంగా షిఫ్టు కావడం విశేషం. భవన సముదాయాలను ప్రారంభించినప్పుడు ఈ నెల 25నాటికి కొన్ని కోర్టులు ఎన్‌సిబిసి నుంచి విధులు నిర్వహిస్తాయని ఎపి హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ సెప్టెంబర్ 24న వెల్లడించారు. ఎపి హై కోర్టు కూడా ఈ కోర్టులు నూతన భవన సముదాయంలోకి మారేందుకు ఇటీవలే అనుమతి ఇచ్చింది. సిబ్బంది, ఉద్యోగులు ఇప్పటికే దీంట్లోకి అవసరమైన డాక్యుమెంట్లను చేరవేశారు. కోర్టులకు సంబంధించిన పత్రాలు, ఫర్నిచర్ అంతటినీ పొందుపరచుకున్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో 22 కోర్టులు

జిల్లా నూతన కోర్టు భవన సముదాయాల కోసం 2007లోనే పునాదిరాయి పడినప్పటికీ 2017 వరకూ పనులు ప్రారంభం కాలేదు. 2017 తర్వాత నూతన కోర్టు కాంప్లెక్స్ పనులు ఊపందుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత పనులు ప్రారంభమై 2023 నాటికి పూర్తయింది. సుమారు రూ.35 నుంచి రూ.40కోట్ల వరకూ ఖర్చు జరిగిందని తెలుస్తోంది. వాస్తవానికి ఈ నూతన కోర్టు భవన సముదాయంలో 22 కోర్టులు ఏర్పాటు చేసుకోడానికి స్థలం, అవకాశం ఉంది. ప్రస్తుత షిఫ్టింగ్ 10 కోర్టులకే పరిమితం చేశారు. ఎందుకంటే పాత కోర్టు భవనాలను సైతం కోర్టు వ్యవహారాలకు వినియోగించనున్నారు. కోర్టు ప్రాంగణంలోకి రెగ్యులర్‌గా సుమారు 3వేల మందికి పైగా వచ్చి పోతూ ఉంటారు. పిటిషనర్లను



సైతం అవసరమైన మేరకు నూతన భవన సముదాయంలోకి వెళ్లి పిటిషన్లను అందజేసేలాగ చర్యలు తీసుకుంటున్నారు. ఈ నూతన సముదాయంలోకి ఫామిలీ కోర్టు కూడా షిఫ్టు కావడంతో చిన్న పిల్లలతో వచ్చిన మహిళలకు అధునాతన సదుపాయాలు కల్పించేలాగ ఏర్పాట్లు ఉన్నాయి. ఇవన్నీ నిబంధనల ప్రకారమే అమర్చినట్లు న్యాయవాదులు చెబుతున్నారు. పిటిషనర్ల కోసం వెయిటింగ్ హాల్స్, అధునాతన టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు. నూతన కోర్టు భవన సముదాయంలో సుమారు 1000 వెహికల్స్ పార్కింగ్, దీంట్లో 800 టూ వీలర్ల సౌకర్యం ఉంది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల భవనాల్లోనూ ఎసి సదుపాయం కూడా రానున్నట్లు తెలుస్తోంది. విశాఖలోనూ మరో 3 నాలుగు నెలల్లో ఎయిర్ కండిషన్ సదుపాయం రానుంది.

కనెక్టివిటీ కొంచెం ఇబ్బందే: పలువురు లాయర్లు

పాత కోర్టు కాంప్లెక్స్ నుంచి కొత్త కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు సరైన కనెక్టివిటీ లేదని పలువురు లాయర్లు తాజాగా భావిస్తున్నారు. నూతనంగా నిర్మితమైన కోర్టు సముదాయంలోకి పాత కోర్టు పై నుంచి రావడానికి సమస్య లేదు. కింది కోర్టు నుంచి మీద కోర్టుకు వెళ్లాలంటే మెట్ల మార్గం సరిగ్గా చేయలేదని చెబుతున్నారు. పాత కోర్టులోకి కొత్త భవంతుల్లోకి ఏదైనా కోర్టు మేటర్ కోసం రావాల్సి ఉంటే కొంత ఇబ్బంది తప్పదని వాపోతున్నారు.


గోదాముకు శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పి చైర్ పర్సన్ సుభద్ర

రైతు ఉత్పత్తిదారుల గోదాముకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల గోదుము నిర్మాణ పనులకు బుధవారం ఉమ్మడి జిల్లాల చైర్పర్సన్ సుభద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐటీడీఏ, హార్టికల్చర్ శాఖల నుండి రూ 11,25,000 లు, రైతు ఉత్పత్తి దారుల సంస్థ (ఎఫ్ పి ఓ) వాటా 3,75,000 లు, మొత్తం 15,00,000 రూ .లు వెచ్చించి భవనాన్ని నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుటామన్నారు. ఈ భవన నిర్మాణంతో మండల పరిధిలో వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘాల నుండి కొనుగోలు చేసిన, గిరిజన ప్రాంతాల్లో పండించే చిరుధాన్యాలు, అన్ని రకాల సరుకులను కొనుగోలు చేసి నిల్వ చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. భవన నిర్మాణ గుత్తేదారులు ప్రభుత్వ నియమ నిబంధనలతో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ కేటాయించిన సమయానికి భవన నిర్మాణం పూర్తి చేసి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం దేవమంగ, సీసీ దామోదరం, దేవమ్మ, జగదాంబ, వెలుగు సీసీలు, వివోఏలు, స్థానిక సర్పంచ్ సుభాస్ చంద్ర, వైసిపి సీనియర్ నాయకుడు కూడా మత్స్య లింగం తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించాలి : చింతా మోహన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా జనాభాలో 40 శాతం ఉన్న ఒబిసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దారుణానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను దేశ ప్రధాని మోడీ సమర్థించడం భారతదేశానికి అవమానకరమన్నారు. జిఎస్‌టితో ధరలు పెరిగాయన్నారు. చివరికి మందులుపైన కూడా జిఎస్‌టి వసూలు చేస్తున్నారన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యమే లేదన్నారు. మైకుకు అనుమతులడిగితే పొల్యూషన్ సర్టిఫికెట్ అడగడం హాస్యాస్పదమన్నారు. వైసిపి అప్రజాస్వామ్య పద్ధతిలో వెళుతుందన్నారు. జాతీయ నూతన విద్యా విధానం అమలు చేస్తూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. ఎపిలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నూతన విద్యా విధానాన్ని రద్దు చేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాలు, యువత వైసిపి మద్యం విధానంతో చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. చంద్రబాబును అరెస్టు చేయడం తప్పు అన్నారు. ఆధారాలు లేకుండా సీనియర్ రాజకీయవేత్తను హింసించడం సరికాదన్నారు. 85 ఏళ్ల మార్గదర్శి అధినేత రామోజీరావుపై ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. ఐపిఎస్ అధికారులు ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో కాకుండా ఇండియన్ పొలిటికల్ సర్వీసులో పనిచేస్తున్నట్లుందని ఎద్దేవా చేశారు. న్యాయస్థానాలపై కూడా నమ్మకాలు పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జడ్జిమెంట్లు ఢిల్లీలో తయారవుతున్నాయని, వీటిలో బిజెపి పాత్ర ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. లీడర్లు, క్యాడర్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు తప్ప కాంగ్రెస్‌కు ప్రజలలో ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి కాంగ్రెస్ భవిష్యత్తు ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలో రాబోతుందన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థుల రాణింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒంగోలులో ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహించిన జోనల్ స్థాయి సిబిఎస్‌సి క్లస్టర్ 8 పోటీల్లో విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్ స్కూల్ పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అహానా రాణీ బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి చేరుకుంది. బాలుర ఫుట్‌బాల్ జట్టు (అండర్ 19) ఛాంపియన్‌గా నిలిచి నేషనల్స్‌కు అర్హత సాధించింది. 9వ తరగతికి చెందిన భవేష్‌ను ఉత్తమ గోల్‌కీపర్‌గా ప్రకటించారు. సిబిఎస్‌సి క్లస్టర్‌లలో బాలుర బాస్కెట్‌బాల్ జట్టు (19 ఏళ్లలోపు) క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది.

దొర కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని గిన్నెపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త కోసు దాసుదొర ఇటీవల అనారోగ్య కారణంగా మరణించగా, ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పరామర్శించారు. కుటుంబానికి టిడిపి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, అరకు పార్లమెంట్ ఎస్టి సెల్ అధ్యక్షులు కారం సింహాచలం, తెలుగు యువత అధ్యక్షులు సిద్దా వెంకన్న దొర, యూనిట్ ఇన్‌ఛార్జులు కుంజం బాపన్న దొర, మడకం పండు దొర, కొండపల్లి వెంకటలక్ష్మి, కోసు నాగన్న దొర, బూత్ ఇన్‌ఛార్జి కారం రాజ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ మోహనరావు

ప్రజాశక్తి-రంపచోడవరం : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ సిబ్బందికి "సోషల్ మీడియా దుర్వినియోగం-సైబర్ మోసాల నివారణలో టెక్నాలజీ పాత్ర" అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం రంపచోడవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో "లైంగిక వేధింపుల నుండి స్త్రీలు- పిల్లల రక్షణ" అన్న అంశంపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎస్సై మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 18 నాటికి ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి -ఆనందపురం : ఓటర్ నమోదు ప్రక్రియ డిసెంబర్ 18 నాటికి పూర్తి చేయాలని బిఎల్‌ఒలకు తహశీల్దార్ లోకవరపు రామారావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బిఎల్‌ఒలు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ

పోలింగ్ కేంద్ర పరిధిలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శించి అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ఓటర్ నమోదు, తొలగింపు ప్రక్రియలను ఈనెల 27 నుండి డిసెంబర్ 18 వరకు ఇంటింటికీ తిరిగి నమోదు చేయాలన్నారు. మండలంలో కొత్తగా 13 బిఎల్‌ఒలను నియమించినట్లు తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒకే ఇంటినెంబర్‌పై అత్యధిక ఓటర్లనున్న నేపథ్యంలో వాటిని సరిచేయాల్సిన బాధ్యత బిఎల్‌ఒలపైనే ఉందన్నారు. ఓటర్ల సవరణ విధులను వాలంటీర్ల సహకారం తీసుకోవద్దని, అలా చేస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులౌతారని హెచ్చరించారు. ముఖ్యంగా ఓటర్ల తొలగింపునకు ఫారం 7 నింపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భీమిలి తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ ఎబిఎఫ్‌గా వినీల

ఎయు పరిశోధక విద్యార్థిని ఎంపికపై విసి ఆచార్య ప్రసాదరెడ్డి హర్షం

ప్రజాశక్తి- విశాఖపట్నం : భారత ప్రభుత్వ నీతిఆయోగ్ ఏస్పిరేషనల్ బ్లాక్ ఫెలో (ఎబిఎఫ్)గా ఎయు బయోకెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలు బాతా హెప్సిబా వినీల ఎంపికయ్యారు. ఆ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు ఆమెకు అందాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలానికి ఏస్పిరేషనల్ బ్లాక్స్ ఫెలోగా వినీల సేవలందిస్తారు. ఈ సందర్భంగా వినీలను ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

ఏస్పిరేషనల్ బ్లాక్ ఫెలోగా ఎంపికైన వినీలకు నెలకు రూ.55 వేలు స్టైఫండ్‌గా కేంద్ర ప్రభుత్వం అందించనుంది. తమకు కేటాయించిన మండలం సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేసేలా



వినీలను అభినందిస్తున్న ఎయు విసి

చూడడం వీరి బాధ్యత. దేశవ్యాప్తంగా 500 ఏస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో 15 బ్లాక్‌లు ఎంపికయ్యాయి.

ఎబిఎఫ్‌లు తమకు కేటాయించిన ప్రాంతంలో స్థానిక ప్రజలకు వర్క్‌షాప్‌లు, సదస్సులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పిస్తారు. వై.రామవరం మండలంలో విభిన్న గ్రామాలలో స్థానిక సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను చూపే దిశగా ఎబిఎఫ్ వినీల పనిచేస్తారు. ఆయా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా సమకూరుస్తుంది.

ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులో ఎయు పరిశోధక విద్యార్థిని వినీల ఎంపిక కావడంపై విసి ఆచార్య ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేసారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా, ప్రతిష్టాత్మకంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో చేరువ చేయాలన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 21 ,22 తేదీలలో ఆంధ్రప్రదేశ్ ఆమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ ఇంటర్‌స్టేట్స్ ఇన్విటేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ -2023 పోటీలలో మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. బాలుర 41 కేజీల విభాగంలో ఎస్ నిఖిల్ బంగారు పతకం, 57 కేజీల విభాగంలో పి వెంకటేష్ బంగారు పతకం అలాగే బాలికల విభాగంలో ద్వితీయ శ్రేణి లో నిలిచి అండర్ 47 కేజీల విభాగంలో ఏ .పవిత్ర (రజతపతకం), అండర్ 51 కేజీల విభాగంలో పి.భార్గవి రజత పతకం సాధించారు. విజేతలకు అడిషనల్ ఎస్‌పి (శాంతిభద్రతలు) జె.కులశేఖర్, అదనపు ఎస్‌పి (అడ్మినిస్ట్రేషన్) జె వెంకటరావు, ఎపి ఆమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ కె.బాబురావు, అధ్యక్షులు వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కోచ్ ఆనంద్ ను పలువురు అభినందించారు.



పతకాలు సాధించిన ఆనంద్ క్లబ్ విద్యార్థులు

ఎల్‌జి పాలిమర్స్ బాధితులను ఆదుకోవడంలో / వైసిపి సర్కారు విఫలం

సిపిఎం నేత డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన జరిగి మూడున్నరేళ్లు గడిచినా, బాధిత కుటుంబాలను ఆదుకోవడంలోనూ, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సిపిఎం నేత, జివిఎంసిలో పార్టీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు ఘాటుగా విమర్శించారు. బుధవారం పాలిమర్స్ చుట్టుపక్కల గ్రామాల్లో సిపిఎంనేతల బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిమర్స్ విడుదల చేసిన విషవాయువులు వలన పలువురు ప్రాణాలను కోల్పోవడంతోపాటు అనేక మంది అనారోగ్యం బారిన పడ్డారన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని గ్రామ ప్రజలు ఫ్లెక్సీలు పెడితే, స్థానిక వైసిపి నేతలు పోలీసుల సహకారంతో వాటిని తొలగించడం దుర్మార్గమన్నారు. వైసిపి సమావేశానికి వెళ్లలేదని ఇద్దరు వాలంటీర్లను తొలగించారని మండిపడ్డారు. పాలిమర్స్ దుర్ఘటన తర్వాత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన అధికారపార్టీ నేతలు, నేటికీ దానిని నెరవేర్చలేదన్నారు. ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన తర్వాత 370 మంది సొసైటీ కార్మికులను తొలగించిన యాజమాన్యం, వారికి. ఆరు నెలల జీతాలు చెల్లించి తరువాత చేతులెత్తేసిందన్నారు. వీరిని ఎల్‌జి పాలిమర్స్ సంస్థలోనే కొనసాగించేలా చర్యలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలులో మాత్రం గాలికొదిలేసిందని విమర్శించారు. ఎల్‌జి పాలిమర్స్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి చీకటి ఒప్పందం జరిగిందని, అందుకే బాధితులను ఆదుకోవడంలోనూ, ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నా పట్టించుకునే దిక్కులేదని గంగరావు మర్శలు గుప్పించారు దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, పాలిమర్స్ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో విస్తృత ప్రచారం చేసి, వైసిపి పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్న వైసిపికి రానున్న ఎన్నికల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలివాడ వెంకటరావు, ఉరుకూటి రాజు పాల్గొన్నారు

బార్బర్‌తో పనేముంది?

- స్వయంగా కటింగ్ చేసుకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి-చింతూరు : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లోని గిరిజనులు అన్ని వృత్తులు వారే స్వయంగా చేసుకుంటూ ఉంటారు. చివరికి క్షురక (బార్బర్) పని కూడా ఒకరికొకరు చేసుకుంటారు. మైదాన ప్రాంతంలో కుల వృత్తుల్లో భాగంగా క్షౌర వృత్తి చేసే నాయీ బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఉంటారు. మొదటిలో వారు ఇంటికి వచ్చి క్షౌర పని చేయగా, తరువాత కాలంలో బార్బర్ షాపులు పెట్టుకుంటూ నాయా బ్రాహ్మణులు జీవనోపాధి పొందేవారు. కాని నేటి ప్రపంచీకరణయుగంలో ప్రత్యేకంగా జెంట్స్ బ్యూటీ పార్లర్లు కూడా ఏర్పడ్డాయి. ఈ పార్లర్స్‌లో కటింగ్, షేవింగ్, ఫేషియల్ పనులకు వందల, వేల రూపాయలు వసూలు చేస్తూ ఉంటారు.


బాలుడిని క్షవరం చేస్తున్న గిరిజనుడు

అయితే చింతూరు ఏజెన్సీ గిరిజన మారుమూల పల్లెల్లో స్వయంగా తమ వారికి తామే కటింగ్‌లు చేస్తూ ఇటు సమయం, అటు నగదు ఆదా చేసుకుంటున్నారు. గిరిజన గ్రామాల్లో ఎక్కడిబడితే అక్కడ బార్బర్ షాపులు ఉండవు. మండల కేంద్రాలకు రావాల్సిందే. ఊరు నుండి మండల కేంద్రానికి రావాలంటే ఆటోకు రాను పోను వందరూపాయలు, కటింగ్‌కు మరో వంద రెండు వందలు ఖర్చు చేయాలి. ఇది గ్రహించిన కొందరు యువకులు తామే కత్తెర్లు దువ్వెనలు మార్కెట్‌లో కొనుగోలు చేసి గ్రామంలో ఎవరికైనా కటింగ్ అవసరమైతే వారే చేస్తున్నారు. పూర్వం వారి పూర్వీకులు కూడా ఇదే విధంగా చేసే వారని ఆదివాసీ గిరిజన పెద్దలు చెబుతున్నారు. కుల వృత్తులన్నీ ఆదివాసీలు చేస్తారు. కమ్మరి పని, తడికలు, బుట్టలు అల్లికలు, జంతు చర్మాలతో డోలు వాయిద్యాలు, కలపతో కర్ర నాగళ్ళు ఇంకా అనేక రకాల పనిముట్లు కూడా గిరిజనులే చేస్తూ ఉంటారు.

ఘనంగా కనకదుర్గమ్మ నిమజ్జనం

ప్రజాశక్తి - కొయ్యూరు : శరన్నవరాత్రుల సందర్భంగా కొయ్యూరులోని కనకదుర్గమ్మ అమ్మవారి నిమజ్జనం మేళ తాళాలు, తీన్మార్, డప్పులు, కోలాటం నృత్యాలు, యువతీ, యువకుల సందడి నడుమ జోరు వానలో అంగరంగ వైభవంగా బుధవారం జరిగింది. కొయ్యూరు, రాజేంద్రపాలెం పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎంవివి ప్రసాద్, సర్పంచ్ మాకాడ బాలరాజు, అనిశెట్టి చిరంజీవి, మేడి బోయిన చిన్న, ఉబ్బల రాజేష్, నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పహరా నడుమ నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేశారు.


కనకదుర్గమ్మ నిమజ్జనంలో పాల్గొన్న గిరిజనులు

వారం రోజులుగా గిరిజన గ్రామాల్లో అంధకారం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి మారుమూల వంతమర్రి, గరిమండ, అన్నవరం, కన్నవరం, కునుకూరు తదితర 20 గిరిజన గ్రామాలకు వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంకా పరిష్కారం చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయంలో కరెంటు లేక నానా అవస్థలు పడుతున్నామని, వెంటనే విద్యుత్ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.